జనవరి 5 నుంచి జాతీయ మహాసభలు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత బాల నరసింహ

హిమాయత్‌నగర్, నవంబర్ 9: అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం రెండవ జాతీయ మహాసభలను 2025 జనవరి నుంచి 7 వరకు ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ తెలిపారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా దళితుల జీవితాల్లో మాత్రం వెలుగులు నిండడంలేదని, వీరి అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలను అవలంభించడం వల్ల దళితులకు ఉపాధి అవకాశాలు లభించడం లేదని ఆరోపించారు. ఈ మహాసభలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్య, ఉద్యోగ, ఉపాధి వంటి అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్, నేతలు తాళ్లపల్లి లక్ష్మణ్, శ్రీనివాస్, ఆరుట్ల రాజ్ కుమార్, ఉష, కుమార్, కె.సహదేవ్, లావణ్య, భద్రయ్య, రాజయ్య, దినేశ్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- శంషాబాద్ జిల్లా పరిషత్ హైస్కూల్ తనిఖీ..
- భోజన నాణ్యతను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

శంషాబాద్ రూరల్, నవంబర్ 9 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను, సిబ్బందిని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శనివారం శంషాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. మొదటగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ..ఉపాధ్యాయులు సమయానికి వచ్చి నాణ్యమైన విద్యనందించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మెనును ప్రతిరోజు ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

శంషాబాద్ పట్టణంలోని హైస్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రణాళిక బద్ధంగా సర్వే నిర్వహించాలి

ప్రణాళిక బద్ధంగా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. శంషాబాద్ పట్టణంలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. ప్రతి కుటుంబం నుంచి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ రవీందర్ దత్, ఎంపీడీవో మున్నీ, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

18వ వార్డులో ..

ప్రజల స్థితిగతులు తెలుసుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి తెలిపారు. శనివారం శంషాబాద్ పట్టణంలోని 18వ వార్డులో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను కమిషనర్ సుమన్‌రావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాని టేషన్ అధికారి లక్ష్మయ్య ఉన్నారు.

శంషాబాద్ మున్సిపాలిటీ 19వ వార్డులో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, తదితరులు

అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వండి

మణికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు కోసం వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, నేతలు

మణికొండ, నవంబర్ 9: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ కోరారు. ఈ మేరకు పుప్పాలగూడలోని మాజీ సర్పంచ్ సునీతారాజ్‌కుమార్ ఇంట్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంతోపాటు పలు ప్రజా సమస్యలపై చర్చించారు. అదే విధంగా నవంబర్ 26తో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి 75 సంవత్సరం పురస్కరించుకొని ఆయనను స్మరిస్తూ విగ్రహాల ఏర్పాటు కోసం తీర్మానించారు. పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో, తానాషా హుడా కాలనీలో మరో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తీసుకున్న అభిప్రాయాలను మణికొండ మున్సిపల్ కమిషనర్‌ను అనుమతి కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్‌కుమార్, కుండగళ్ల ధనరాజ్, రూపారెడ్డి, నాయకులు గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, ప్రకాశ్, ముత్తంగి లక్ష్మ య్య, అందె లక్ష్మణ్‌రావు, బొమ్మూ ఉపేందర్నాథ్‌రెడ్డి, యాలాల కిరణ్, షేక్ అరీఫ్, బాబురావు, సుమన్, రాజేంద్ర ప్రసాద్, విజయలక్ష్మి, కీర్తిలతాగౌడ్, సుమ, టైగర్ రేఖ, మంజు, ప్రవీణ్, శ్రీబాబు, గణేశ్, సంతోశ్, రమేశ్, జై, అశోక్, బబ్లూ, శ్రీనివాస్, మహేందర్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

నీరజకు చాణక్య అవార్డు

వ్యవసాయ యూనివర్సిటీ , నవంబర్ 9 : పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ)2024 చాణక్య అవార్డును రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్ నార్మ సంస్థకు చెందిన పీఆర్‌ఓ డా.నీరజ స్వంతం చేసుకుందని పీఆర్‌సీఐ చైర్మన్ శ్రీనివాస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నీరజ.. సంస్థ ట్రైనింగ్స్ , అధికారులు, శాస్త్ర వేత్తలు, టీచింగ్ నాన్‌టీచింగ్‌తోపాటు మీడియాకు ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతో అందరి మన్ననలు పొందారని తెలిపారు.

పేదలకు ప్రయోజనం కలిగించేందుకే సర్వే

ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, నవంబర్ 9: పేదలు, బలహీనవర్గాల స్థితిగతులను అధ్యయనం చేసివారికి ప్రభుత్వం సరైన రీతిలో సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కులగణన చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చినమాట మేరకు సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమయిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి కల్పన, తదితర అంశాలపై సమగ్రమైన సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటేనే అర్హులకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో సమగ్రమైన వివరాలు సేకరించాలని నిర్ణయించారని, సమగ్ర సర్వే గురించి లేనిపోని అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ఇంటివద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలని, సరైన వివరాలు అందించాలని కోరారు.

బీసీ జర్నలిస్టు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

బీసీ జర్నలిస్టు సంఘాల జేఏసీ లోగోను ఆవిష్కరిస్తున్న కొత్త లక్ష్మణ్ పటేల్, మేకల కృష్ణ యాదవ్, నీలకంఠం ,తదితరులు

ఖైరతాబాద్, నవంబర్ 9 : బీసీ జర్నలిస్టు సంఘాల జేఏసీ లోగోను శనివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ ప్రతినిధులు కొత్త లక్ష్మణ్ పటేల్, మేకల కృష్ణ యాదవ్, నీలకంఠం ముదిరాజ్, బొమ్మ అమరేందర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 50 శాతం కంటే అధిక సంఖ్యలో బీసీలు ఉన్నారని, జర్నలిస్టులు సైతం అత్యధిక శాతం వెనకబడిన వారే ఉన్నారన్నారు. బీసీ జర్నలిస్టులపై రోజు రోజుకు దాడు లు పెరిగిపోతున్నాయని, పాలక ప్రభుత్వాలు సైతం వారి సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. అక్రిడిటేషన్ కమిటీలో బీసీ కుల జర్నలిస్టు సంఘాల అసోసియేషన్ నుంచి ఒకరికి సభ్యుడిగా అవకాశం కల్పించాలని, వారి సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, బీసీ జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత కల్పించాలని, అసోసియేషన్ కోసం ప్రభుత్వమే భవనాన్ని నిర్మించాలని, ప్రతి పాఠశాల, కళాశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ జర్నలిస్టు సంఘాల జేఏసీ ప్రతినిధులు డాక్టర్ సుంకర రామ్మూర్తి, ముదం శంకర్, సునీల్ పటేల్, ఎ. రాజేశ్, చిలుకూరి హరిప్రసాద్, నీలకంఠం ముదిరాజ్, నరసింహరావు ముదిరాజ్, బొమ్మ అమరేందర్, వెంకట్ దాదె, తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌లో సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న డీసీ జాకియా సుల్తానా, ఇతర అధికారులు

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి..

జూబ్లీహిల్స్,నవంబర్9: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా ఆదేశించారు. శనివారం యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో సర్వే సిబ్బంది చేపడుతున్న స్టిక్కరింగ్ ప్రక్రియను జోనల్ నోడల్ ఆఫీసర్, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో చేపట్టిన ఇంటింటికీ స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తయిందని.. సోమవారం నుంచి పూర్తిస్థాయి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ సర్కిల్ నోడల్ ఆఫీసర్, యూసీడీ డీపీఓ వెంకట కిషన్‌రావు, ఏఎంసీ కమల్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని బూత్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఉప కమిషనర్ రవికుమార్

ఓటరు లిస్టులో పేరు నమోదు చేసుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 9: కొత్తగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు లిస్టులో తమ పేరును నమోదు చేసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్ సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని గణేశ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూత్ నంబర్ 426, 427, 428, మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని బూత్ నంబర్ 363, 367లలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు లిస్ట్‌లో ఉన్న తప్పొప్పులను సవరించుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసేందుకు(ఫామ్-6), ఓటరు జాబితాలో అభ్యంతరాలకు(ఫామ్-7), జాబితాలో మీ చిరునామా సవరణకు(ఫామ్-8)లను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం

బంజారాహిల్స్,నవంబర్ 9: కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఓటర్ జాబితాలో తప్పొప్పులను సవరించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో శనివారం ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు, జీహెచ్ఎంసీ సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించారు. ఓటర్ జాబితాలో తమ పేరు ఉందా అని పలువురు ఓటర్లు పరిశీలించుకున్నారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు.

'ఐ' ఫోన్ అమ్మకం పేరిట టోకరా

వెంగళరావునగర్, నవంబర్ 9: ఓఎల్ఎక్స్‌లో 'ఐ' ఫోన్ అమ్మకం పేరిట ఉన్న ప్రకటనకు ఓ యువకుడు ఆకర్షితుడై సైబర్ నేరగాడికి చిక్కి మోసపోయాడు. దీంతో బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. టోలీచౌకి ప్రాంతానికి చెందిన ఎం.డి.రజియుద్దీన్ మోసిన్ ఓఎల్ఎక్స్‌లో 'ఐ' ఫోన్ అమ్మకం పేరిట ఉన్న ప్రకటనను చూసి ఆకర్షితుడయ్యాడు. ఆ ఫోన్ కోసం పోస్టు పెట్టిన సైబర్‌నేరగాడు కిరణ్ అనే వ్యక్తిని సంప్రదించి రూ.28వేలకు కొనుగోలు చేసేందుకు అంగీకరించాడు. అనంతరం కిరణ్ తనకు ఆఫీస్ ఉందని, తన ఇంటి లొకేషన్ షేర్ చేస్తానని చెప్పాడు. ఈ క్రమంలో ఓఎల్ఎక్స్‌లో మరో ప్రకటనలో 'ఐ' ఫోన్ పెట్టిన లక్ష్మీనారాయణను సైబర్ నేరగాడు కిరణ్ సంప్రదించి తన సోదరుడు వచ్చి ఐ ఫోన్ చూస్తాడని, మీ లొకేషన్ షేర్ చేయాలని లక్ష్మీనారాయణను కోరాడు. వెంటనే ఎల్లారెడ్డిగూడలోని ఆ లోకేషన్‌ను మోసిన్‌కు పంపాడు. మోసిన్ అక్కడికి వెళ్లి ఐ ఫోన్‌ను చూసి నచ్చడంతో సైబర్ నేరగాడు కిరణ్‌కు రూ.25,500 పంపాడు. ఆ తర్వాత డబ్బు మీ సోదరుడికి చెల్లించానని, ఐ ఫోన్ ఇవ్వాలని చెప్పడంతో నాకు సోదరుడు ఎవరూలేరని తన ఖాతాకు డబ్బులు రాలేదని లక్ష్మీనారాయణ చెప్పడంతో ఇద్దరు ఖంగుతిన్నారు. దీంతో ఇద్దరు కలిసి సైబర్ నేరగాడు కిరణ్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. ఫోన్ స్వచ్ఛాఫ్‌లో ఉన్నది. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు మోసిన్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాఫిక్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,నవంబర్ 9: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులను దూషించడంతో పాటు విధులను అడ్డగించిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు జూబ్లీహిల్స్ రోడ్ నం.10లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన ఓ కారు డ్రైవర్ రాజుకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేపట్టగా 175 బీఏసీ పాయింట్లు వచ్చింది. దీంతో కారులోనుంచి డ్రైవర్‌ను కిందకు దింపి కారును పీఎస్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో అతను ట్రాఫిక్ పోలీసులను తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు ట్రాఫిక్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని న్యూసెన్స్‌కు పాల్పడ్డాడు. ఈ మేరకు తనపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు అడ్డు తగిలాడని కానిస్టేబుల్ మదన్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఆపదలో ఉన్న పేదలను ఆపద్బంధులా ఆదుకుంటుందని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం డివిజన్‌లోని హబీబ్ ఫాతిమా నగర్‌కు చెందిన ఖాజి మెహబూబ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును అందజేశారు.

– జూబ్లీహిల్స్, నవంబర్ 9

మేడేను సెలవుదినంగా ప్రకటించాలి

హిమాయత్‌నగర్, నవంబర్ 9: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 2025 సెలవు దినాల క్యాలెండర్‌లో మే1 మేడే దినోత్సవానికి సెలవు ప్రకటించక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా ఉందని విమర్శించారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు మే1న కార్మిక దినోత్సవంగా గుర్తించి సెలవు ఇచ్చేవని, ఈ ప్రభుత్వం మేడేకు సెలవు ఇవ్వకపోవడం హేయమైన చర్య అని అన్నారు. కార్మికులు ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించున్న మేడే దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు పండుగలాగా జరుపుకుంటారని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ సెలవును రద్దు చేయడమంటే నిరంకుశ విధానంకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి క్యాలెండర్‌ను సవరించి మేడేను సెలవుదినంగా ప్రకటించాలని లేని పక్షంలో ఉద్యమం చేస్తామని వారు హెచ్చరించారు.

రైల్వే ఉద్యోగాల్లో తెలంగాణకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ

హిమాయత్‌నగర్, నవంబర్ 9: రైల్వే ఉద్యోగాల భర్తీలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేయాలని ప్రయత్నిస్తే ఉద్యమిస్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్రలు హెచ్చరించారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో అత్యున్నత సర్వీస్‌లైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి ఉద్యోగాలను భర్తీ చేసే సమయంలో 13 ప్రాంతీయ భాషల్లో రాత పరీక్షలు నిర్వహిస్తుంటే, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుతో భర్తీ చేసే ఉద్యోగాలకు ఇంగ్లీష్, హిందీ భాషల్లోనే పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. దీంతో ఉత్తరాది వారికే ఉద్యోగాలు లభిస్తున్నాయని, తెలుగు యువత అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జరిగే అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన రాత పరీక్షలను తెలుగులో రాసేందుకు అనుమతి ఇవ్వాలని ఆర్ఆర్ బోర్డు, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర

రైల్వే బోర్డు భర్తీ చేసే ఉద్యోగాలకు రాత పరీక్షలను తెలుగులో నిర్వహించేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, రాష్ట్ర నేతలు టి.సత్యప్రసాద్, లింగం, రవి, శ్రీమాన్ పాల్గొన్నారు.

శ్రీనికేతన్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని శ్రీనికేతన్ కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం కాలనీలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వారి సమస్యలను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. సీవరేజ్, రోడ్డు సమస్యలు ఉన్నాయని కాలనీ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి తెలిపారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

– బంజారాహిల్స్,నవంబర్ 9

ఖైరతాబాద్ మహాగణపతి నవరాత్రోత్సవ వేడుకల్లో బడా గణేశ్‌ను చూస్తూ క్యాన్వాస్‌పై లైవ్ పేయింటింగ్ వేసిన చిత్రకారిణి, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నామోదు లావణ్యను శనివారం సత్కరించిన గణేశ్ ఉత్సవ కమిటీ

– ఖైరతాబాద్

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 9: అత్తాపూర్ డివిజన్, హైదర్‌గూడ శ్రీ పోచమ్మ దేవాలయం ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీకి శాశ్వత పరిష్కారం చూపించాలని దేవాలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు దేవాలయ కమిటీ అధ్యక్షుడు సోమారం రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శనివారం రాజేంద్రనగర్ జలమండలి జీఎం సాయిలక్ష్మి, డీజీఎం జవహర్ అలీ, మేనేజర్ శ్రావ్యరెడ్డిల ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సోమారం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. హైదర్‌గూడ శ్రీ పోచమ్మ దేవాలయాన్ని నూతనంగా పునర్నిర్మిస్తున్నామన్నారు. గతంలో ఈ దేవాలయం కింద నుంచి డ్రైనేజీ నీరు పారుతూ అమ్మవారి విగ్రహం వద్దకు వచ్చాయని, దీని కారణంగా భక్తులు తీవ్ర అసౌకర్యాలకు గురైయ్యారన్నారు. సమస్యను జలమండలి అధికారుల దృష్టి కి తీసుకువెళ్లిన సమయంలో తాత్కాలిక మరమ్మతులు చేశారు. ప్రస్తుతం దేవాలయాన్ని పునర్నిర్మిస్తున్నామని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నూతన పైపులైన్‌లు వేయాలని కోరామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మద్దూరి బాలసుబ్రహ్మణ్యం, చంద్రయ్య, మద్దూరి బాలమురళీకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం.. మందులు పంపిణీ

హిమాయత్‌నగర్, నవంబర్ 9: పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని గాంధీ కుటీర్ బస్తీ అధ్యక్షుడు తోట శివకుమార్ ముదిరాజ్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు వెంకట నారాయణ, నర్సింగ్‌రావు, కిమ్స్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ విక్రమ్ అన్నారు. జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ దవాఖాన ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడ, గాంధీకుటీర్ బస్తీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చినవారికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ ఎం.శ్రీనివాస్ , గాంధీ కుటీర్ బస్తీ కమిటీ వైస్ చైర్మన్ వేణు,ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్, దాస్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

వీరన్న(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 9: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం..శాస్త్రీపురం ప్రాంతానికి చెందిన సి.వీరన్న(44) ఈ నెల 5న ఉదయం ఇంట్లో నుంచి బయట కు వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ కోసం వెతికారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

వెంగళరావునగర్, నవంబర్ 9: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ జానకమ్మ తోట వద్ద గంజాయి విక్రయిస్